# చిలకజోస్యం

"చిలకజోస్యం చెపుతాం-రామచిలుకజోస్యం జరిగిపోయినవి-జరుగబోయేవి ఉన్నది ఉన్నటుల చెపుతాం- రామ చిలుక జోస్యం

చదువు-సంసారం-సంతానం-ఉద్యోగం- వ్యాపారం బాలారిష్టం-శనిదోషం- కుజదోషం-గ్రహదోషం పరిహారం ప్రశ్న చెపుతాం-రామ చిలుక జోస్యం"

చిలుక జోస్యుడి గొంతుక కాలనీలో ప్రతిధ్వనిస్తోంది. పిల్లలు స్కూలు బేగ్స్‌తో వీధిలోనికి పరుగులిడుతున్నారు. చిలుక జోస్యుడు ఆ కాలనీలో అడుగుపెట్టేడంటే ఉదయం ఎనిమిది గంటలైందన్న మాటే! అతని కేకలు విని టైమ్ సరిచేసుకోవచ్చు.

మోకాళ్ల వరకూ వ్రేల్లాడే పసుపురంగు పంచ, కంటిమెడ లాల్చీ, తలకి ముదురాకు పచ్చరంగు బట్ట పాగా, భుజాన్న పటకాతో వ్రేలాడే జోడు చిలుకలున్న పంజరం, పంజరం మీద మూడు తాళపత్ర గ్రంథాలు, నుదుట సిందూరం బొట్టు, మెడలో రుద్రాక్ష, తులసి పూసలు మాలలు వేసుకొని చేతిలో గొడుగు పట్టుకొని నిదానంగా అడుగులు వేసుకుంటూ ప్రతిరోజూ ఉదయం ఆ కాలనీ గుండా వెళుతుంటాడు చిలుక జోస్యుడు.

పంజరంలో చిలుకలు చిన్న చిన్న మాటలు పదే పదే వల్లిస్తుంటాయి. ఆ చిలుకల పలుకులు వినడానికి చిన్నారులు అతని చుట్టూ చేరి జామికాయలు, అరటిపళ్లు అతడికిచ్చి "బాగా చదవాలి! జయం కలుగుతుంది" అని అతనిచేత చిలుకల చేత అనిపించుకొని స్కూలుకి వెళ్లడం వారికి పరిపాటి.

చిలుక జోస్యుడు పైన అతని చిలుక జోస్యం మీద ఆ కాలనీ వాసుల కెంతో నమ్మకముంది. ప్రతిరోజూ కనీసం ఇద్దరు ముగ్గురు ఆ కాలనీ వాసులు అతని చిలుక జోస్యం చెప్పించుకోకుండా వుండరు.

"మమ్మీ! నాకు తొందరగా జామకాయలు ఇవ్వు! చిలుకజోస్యుడు వెళ్లిపోతున్నాడు'' అంటూ సుధీర్ తల్లిని తొందరపెట్టేడు.

"సునీతా! ఫ్రిజ్‌లో వున్న రెండు జామకాయలు వాడికిచ్చి పంపించు. నాకు చేయి తీరబాటులేదు!" అంటూ కిచెన్‌లోంచి కేక పెట్టింది విశాల.

అక్క కేక విని సునీత ఫ్రిజ్‌లోంచి రెండు జామకాయలు తీసి సుధీర్‌కిచ్చింది. వాడు వాటిని అందుకొని స్కూల్‌బేగ్‌లో వేసుకొని "పిన్నీ టాటా" అంటూ బయటకు పరిగెత్తేడు.

"ఏమిటి అక్కా! వీళ్ల క్రేజ్! ఈ కంప్యూటర్ ఏజ్‌లో కూడ ఇంకా చిలుక జోస్యం ఏంటి!'' అంది సునీత కిచెన్‌లోకి వస్తూ.

"ఏం చెప్పమంటావ్! మేము ఈ ఊరొచ్చి ఏడాదైంది! వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను ఇక్కడ వాళ్లకందరికీ ఆ చిలుకజోస్యం ప్రశ్నమీద ఎంతో నమ్మకం! చదువుకున్న వాళ్లకి కూడా అతడి జోస్యం పైన ఎంతో గురి వుంది. సరే! ఆ విషయం వదిలెయ్యి. నువ్వు బేంకికి ఎన్ని గంటలకి వెళ్లాలి? మీ బావగారు పది గంటలకు లంచ్ తీసుకొని ఆఫీసుకి వెళతారు. ఆ టైమ్‌కి నువ్వు రడీగా వుంటే కార్లో నిన్ను మీ బేంకి వద్ద డ్రాప్ చేస్తానన్నారు" అంది విశాల.

"నాకేం తొందరలేదు అక్కా! నేను పదకొండు గంటలకి వెళతాను. బేంక్ కారు వస్తుంది'' అంది సునీత.

సునీత ఎమ్.ఎ ప్యాసై బేంక్ ఆఫీసరుగా హైదరాబాద్‌లో జాబ్ చేస్తోంది. ఈ వూర్లో వున్న బ్రాంచి ఇన్స్‌పెక్షన్‌కి గత రాత్రి వచ్చింది.

సాయంత్రం ఐదు గంటలకి సునీత ఇంటి కొచ్చేసరికి డ్రాయింగ్ రూమ్‌లో ఆమె అక్కతోపాటు మరో నలుగురు మహిళలు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"రా సునీత! వీరు రాజేశ్వరిగారు. లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్, వీరు అఖిలగారు సెక్రెటరీ, ఈవిడ మనోరమగారు, ఆవిడ మంజులగారు. అంతా ఈ కాలనీలోనే వుంటున్నారు. ఎల్లుండి క్లబ్ వార్షికోత్సవం! ఇన్విటేషన్ ఇవ్వడానికి వచ్చేరు. మా సిస్టర్ సునీత, హైదరాబాద్‌లో బేంక్ ఆఫీసర్" అంటూ ఒకరికొకర్ని పరిచయం చేసింది విశాల.

వారు సునీతకు కూడా ఇన్విటేషన్ కార్డ్ ఇచ్చి "తప్పకుండా రావాలని " ఇన్వాయిట్ చేసేరు.

సునీత లోనికి వెళ్లి డ్రస్ మార్చుకొని వచ్చింది. విశాల అందరికీ టీ బిస్కట్స్ ఇచ్చింది.

రాజేశ్వరిగారు మాటలు సందర్భంలో చిలుక జోస్యుడి జోస్యం గురించి అతని ప్రతిభ గురించి ఎంతో గొప్పగా చెప్పేరు. సునీత ఆవిడ ద్వారా చిలుకజోస్యం ప్రశ్న చెప్పే విధానం తెల్సుకుంది.

"అక్కా! అన్నట్లు నీకు చెప్పలేదు కదూ! నేను యీ మధ్య న్యూమరాలజీ ప్రశ్నభావం,

పరిహార భావం స్టడీచేసి ఎందరికో ప్రశ్న చెప్పేను. అందరికీ నేను చెప్పినట్లే జరుగుతోందిట' ' అంది సునీత కేజువల్‌గా.

విశాల చెల్లెలివేపు ఆశ్చర్యంగా చూసింది.

"ఏవండీ సునీతగారూ! మాక్కూడా చెప్పరా? ప్లీజ్!" అన్నారు రాజేశ్వరిగారు.

"చెప్పొచ్చు కాని ప్రస్తుతం నాదగ్గర ఆ సరంజామా ఏదీ లేదే? ఎలాగ?" అని క్షణకాలం ఆలోచించి "మీరు పేకాట ఆడుతారా?" అంది.

"మా క్లబ్‌లో రోజూ ఆడుతాము" అన్నారు రాజేశ్వరి గారు.

"గుడ్, అక్కా! ఇంట్లో పేకదస్తా వుందా?" అంది సునీత.

"లేదు! మీ బావగారు పేక ముక్కలు ముట్టుకోనివ్వరు"

"మరెలాగా?"

"మా ఇంట్లో వుంది తెప్పించమంటారా? ఫోన్ చేస్తే మా పనిమనిషి పట్టుకొస్తుంది" అన్నారు అఖిలగారు.

"వన్ మినిట్! నా బేగ్‌లో వుండాలి చూస్తాను. లేకుంటే ఫోన్ చేసి తెప్పిద్దురు" అని లోనికి వెళ్లి బేగ్‌తో తిరిగొచ్చి "లక్కీగా వుంది లెండి" అని కార్డ్స్ బయటకు తీసింది.

"రాజేశ్వరిగారు! ఒకటి నుండి పది లోపు అంకెల్లో మీకు నచ్చని అంటే మీరు అశుభం అనుకునే అంకె చెప్పండి!" అంది సునీత.

"ఏడు" అన్నారు.

"అలాగే ఎరుపు-నలుపు వీటిలో నచ్చని రంగు"

"నలుపు"

"అంటే నలుపురంగు, ఏడు అంకెని మీరు అశుభంగా భావిస్తారు" అని పేకముక్కలు చక్కగా కలిపి పేకదస్తా టీపాయ్ మీద వుంచి ముక్కలు ప్రక్కకు జరిపి "ఏదీ ఒక కార్డ్ తీసి చూడండి మీకు త్వరలో శుభం కలుగుతోందో లేదో చూద్దాం" అంది.

రాజేశ్వరిగారు మధ్యలో వున్న కార్డ్ తీసి చూసేరు. వెంటనే ఆవిడ ముఖం వెలవెలబోయింది. ఆవిడ తీసిన కార్డ్ ఇస్పేటు ఏడు!

సునీత ఆవిడ చేతిలోని కార్డ్ అందుకొని పేక దస్తాలో వుంచి పేకముక్కల్ని చక్కగా కలిపి వాటిని టీపాయ్‌మీద ఉంచి ముక్కల్ని పక్కకు జరిపి "అఖిలగారు మీరు రాజేశ్వరిగారి తరపున ఒక కార్డ్ తీసి వారి చేతికివ్వండి!" అంది.

"అఖిలగారు కార్డ్ తీసి రాజేశ్వరిగారికిచ్చేరు" అది కళావర్ ఏడు.

సునీత ఆ కార్డ్ కూడా పేకముక్కల్లో కలిపి ముక్కల్ని నాలుగైదుమార్లు బాగా కలిపి పేకదస్తా టీపాయ్ మీద వుంచి ముక్కల్ని ప్రక్కకు జరిపి 'మనోరమగారు మీరు కూడా రాజేశ్వరిగారి తరఫున ఒక కార్డ్ తీసి వారి చేతికివ్వండి!" అంది.

మనోరమగారు కార్డ్ తీసి రాజేశ్వరిగారి చేతికిచ్చేరు. అది ఇస్పేటు ఏడు!

రాజేశ్వరిగారికి ముచ్చెమటలు పట్టేయి. "త్వరలో తనకేదో అశుభం జరుగబోతోంది. అది ముమ్మారు రుజువైంది" అని అనుకొని భయంతో వణికిపోయేరు.

సునీత పేక ముక్కల్ని బేగ్‌లో పడవేసింది. రాజేశ్వరి గారి పరిస్థితి చూసి జాలిపడి-

"రాజేశ్వరిగారూ! మీకేదో అశుభం జరుగబోతోందని మీరు భయపడుతున్నారు కదూ?' ' అంది.

"అవునండి! ఆ విషయం ముమ్మారు రుజువైంది కూడా"

"మీరేం వర్రీ అవకండి! నాకు పరిహారం తెలుసు. నా మంత్రశక్తితో మీకు అశుభం జరగకుండా చేయగలను...కానీ..." అంది సునీత.

"కానీ- అని సందేహించకండి ఏమిటోచెప్పండి" అన్నారు.

"మరేమీ లేదు పరిహారానికి వంద రూపాయలు అవుతుంది. అది మీలాంటివారిని అడగడం బావుండదేమోనని..."

"ఓస్ వంద రూపాయలే కదా! ఫర్వాలేదు ఇవిగో వెంటనే పరిహారం చెయ్యండి ప్లీజ్!" అంటూ వందరూపాయల నోటు టీపాయ్ మీదుంచేరు రాజేశ్వరిగారు.

"అక్కా! కొద్దిగా కుంకం తెచ్చిపెట్టవా?" అంది సునీత.

జరుగుతున్న తతంగం అంతా వింతగా గమనిస్తున్న విశాల వెంటనే తేరుకొని లోనికి వెళ్లి కొద్దిగా కుంకుమ కాగితంలో వేసి తెచ్చి సునీతకిచ్చింది.

సునీత కుంకుమ పట్టుకొని కొద్ది నిముషాలుకళ్లు మూసుకొని తను బొట్టుపెట్టుకొని మిగిలిన కుంకుమ రాజేశ్వరిగారికిచ్చి 'బొట్టుపెట్టు"కోమంది.

రాజేశ్వరిగారు వణుకుతున్న చేతులతో అందుకొని భగవంతుడిని తలచుకొని బొట్టుపెట్టుకున్నారు.

"ఇంక మీరు నిశ్చింతగా వుండండి! మీకు జరుగబోయే అశుభానికి పరిహారం చేసేను' ' అని టీపాయ్ మీద ఉన్న వంద రూపాయలనోటు తీసి బేగ్‌లో పడవేసింది.

రాజేశ్వరిగారు అనుమానంగా సునీతవేపు చూసేరు. ఆవిడకు ఇంకా పూర్తి నమ్మకం కలుగలేదు.

"మీకు పూర్తి నమ్మకం కుదిరినట్లు లేదు" అంది సునీత చిరునవ్వుతో.

"అదేం కాదు..." అన్నారు తటపటాయిస్తూ

"పర్వాలేదు! మీకు పూర్తి నమ్మకం కల్గిస్తాను. మీకు శుభం అనుకున్న అంకె ఒకటి నుండీ పదిలోపున వున్నది చెప్పండి!"

"మూడు!" అన్నారు రాజేశ్వరిగారు.

"మీకు ఎరుపురంగు శుభం కదా!" అని బేగ్‌లోంచి పేక ముక్కలు తీసి చక్కగా కలిపి టీపాయ్ మీద ఇది వరకు వలే పేర్చి "ఒక కార్డు తీయండి!" అంది.

రాజేశ్వరిగారు కార్డు తీసి చూసేరు. అది ఆఠీన్ మూడు! ఆనందంతో ఆవిడ ముఖం విప్పారింది.

సునీత ఆవిడ చేతిలోని కార్డ్ అందుకొని పేకదస్తాలో వుంచి చక్కగా ముక్కలు కలిపి అఖిలగారిని రాజేశ్వరిగారి తరపున ఒక కార్డ్ తీసి ఆవిడకు ఇవ్వమంది. అఖిలగారు తీసిన కార్డ్ డైమన్ మూడు! ఆ కార్డును మిగిలిన ముక్కలతో చేర్చి చక్కగా కలిపి ఈమారు రాజేశ్వరిగారి తరపున మనోరమగారిని 'కార్డ్ తీయండి!" అంది.

మనోరమగారు తీసిన కార్డ్ ఆఠీను మూడు! సునీత పేక ముక్కల్ని బేగ్‌లో ఉంచింది.

రాజేశ్వరిగారి మనసు పూర్తిగా కుదుట పడింది.

"సునీతగారూ యు ఆర్ గ్రేట్! మీలో నిజంగానే అద్భుత శక్తులున్నాయి!" అన్నారు.

"మీరు మనస్ఫూర్తిగా అంటున్నారా? లేక ఏదో..."

"అదేవిటండీ బాబూ! అంత ప్రత్యక్షంగా కళ్లకు కట్టినట్లు రుజువు చేసేరు! ఎందుకు నమ్మను! మీరు కూడా ఆ చిలుక...."

"ఆపండి! ఆపండి" అని సునీత పకాలున నవ్వి ఏ శక్తులూలేవు! అంతా మీ అమాయకత్వం, భ్రమ, మూఢనమ్మకాలు!" అంటూ తాను చేసిన మేజిక్ ట్రిక్, చిలుకజోస్యుడు చేసే ట్రిక్ గురించి వివరంగా చెప్పి ఆవిడ ఇచ్చిన వంద రూపాయల నోటు ఆవిడకు తిరిగి ఇచ్చివేస్తూ-

"చదువుకున్న వాళ్లు కదా ఇకనైనా మూఢవిశ్వాసాలు విడిచిపెట్టండి!" అన్న సునీత మాటలకు నిర్ఘాంతపోయేరు అందరూ.

**(ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, 8-7-1999)** ✪